శ్రీ

చింతామణి.

ఇది మాసమునకొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౮.] రాజమహేంద్రవరము. [సంచిక ౧.
జయసంవత్సర మాఘమాసము.

కృతివిమర్శనము.

రహస్యదర్పణము:— ఈపేరట ఆచంట వేంకటరాయ సాంఖ్యాయనులచే రచింపఁబడి మాకుఁ బంపఁబడిన పుస్తకమును సావధానముగాఁ బరిశీలించితిమి. ఇది భూస్వభావ చరిత్రములను దెలుపుచు ఇంగ్లీషుభాషయందున్న జియాలజీ (Geology) యను శాస్త్రమున ననుసరించి తెనుఁగున వ్రాయఁబడ్డ గ్రంథము. విద్యాసాహాయ్యమును శాస్త్రపాండిత్యము నక్కఱలేక కేవల జడబుద్ధితోఁ జూచునపుడే యీ బాహ్య ప్రపంచసృష్టి వైచిత్ర్యము హృదయమున కత్యాశ్చర్యమును గలిగించుచున్నది. ఈ గ్రంథమో, జనసామాన్యమందలి యధిక సంఖ్యాకులకు దుర్విజ్ఞేయమయిన సృష్టి రహస్యము లనేకములను వెల్లడించుచుండుటచేత వారల మనస్సునకు మఱింత యాహ్లాదమును జ్ఞానాభివృద్ధినిఁ గలిగించుచు, లోకమునకు మిగులఁ బ్రయోజనకరముగా నున్నది.

ఈపుస్తక మైదుభాగములుగా విభజింపఁబడినది. చర్మచక్షుస్సులకుఁ జూడ శక్యముగాని యణుస్వరూపములయిన జీవాణువుల రహస్యములు ప్రథమభాగమందును, క్రిమికీటక రహస్యములు ద్వితీయభాగమందును, పక్షి రహస్యములు తృతీయభాగమందును, జంతుయాత్రా రహస్యములు చతుర్థభాగమందును, తరుగుల్మలతాదుల రహస్యము లైదవభాగమునందును, చక్కఁగా వివరింపఁబడినవి.

ఇది మనభాషలోని వింతగ్రంథముగనుక దీనియందలి విషయములం గొన్నింటిని దిక్ప్రదర్శనముగాఁ దెలిపెదము.

(Microscope) 'మైక్రాస్కోప్' అని యింగ్లీషునందు వాడఁబడెడునదియు, ఏ సూక్ష్మవస్తువునకయినను, పదునైదువందలరెట్లు యధికరూపము వ్యాపింపఁ జేయఁజాలినదియునయిన యణుదర్శక యంత్రసాహాయ్యముండినందప్ప, మన కన్నులకగపడని యణువులు, జీవజంతువుల సంఖ్యాకము లీప్రపంచమందు స్థలమందును, జలమందును, వాయువునందును, ఆకాశమందును, జంతుశరీరమందునుగలవు. వానిరూపములు, కృత్యములు, శరీరపరిమాణములు, జీర్ణకోశములు, నానావిధములు. అందు గొన్నిటికినూటేసి

జీర్ణకోశములుండును. వానికి నిద్రలేదు సముద్రపునీటికి రాత్రి ధాళధళ్యము గ్రాలుట తేజోరూపమయిన యీ జీవాణుసముదాయముచేతనే. వీటిలో నొకజాతి దాని పరిమాణము అంగుళములో నలుబదియైదు వేలవవంతు. కొన్ని బురదనేలయందివి యనేక గజముల దళముగలిగి సాంద్రమయియుండును. జర్మనీదేశమందలి యొకపట్టణ మట్టి నేలమీఁదఁ గట్టఁబడినది. జలప్రళయమునకుఁ బూర్వమీజీవాణుసంఖ్య యత్యధికముగా నున్నట్లు కన్పించుచున్నది ఇప్పటి కొన్నిపర్వతములాజీవాణు కళేబరమయములే

అమెరికాఖండమందలి కొన్నిచోటుల ప్రజలు మన్నుదిని జీవింతురు. ఆమంటినిఁ బరీక్షింపఁగా రుచికరములయిన జీవాణువులందున్నట్లు తేలినది. ఈజిప్టుదేశమందలి 'పిరమిడు' లను మహాగోపురముల శిలలీ యణుస్వరూపములే.

నవరత్నములలో నొకటిగా నెంచఁబడు పగడము జీవాణుమయము.

ఇఁకఁ గ్రిమికీటక రహస్యము:— అవి మనకంటికతిసూక్ష్మములుగాఁ గన్పించుచున్నను, అందు, దోమలు, ఈఁగలు, మిడుతలు మొదలయిన కొన్నింటి యవయవపాటవమసాధారణమయినది. మనచేతి నొకమాఱు పైకెత్తి క్రిందికిదించునంతటి కాలములోఁ గొన్నిపురుగులు ౫౦౦ మాఱులను, ఈఁగలు ౬ ౦ మాఱులును దమ జెక్కల నాడించును.

కొన్ని పురుగులు తమ కవసరమయిన శబ్దమునే మాత్రము గ్రహించి యనవసరమగు శబ్దమును వినవు. ఇందుకు నిదర్శనముగాఁ దేనెపట్టునొద్ద శతఘ్నులు (ఫిరంగులు) పేల్చినను ఆధ్వనినిఁ దేనెటీఁగలు సరకుసేయవు. ఒకజాతి పురుగు పది తరములలో సహస్రకోటికోటుల పిల్లలఁబెట్టును

ఇట్లే గ్రంథమంతయు విచిత్రకథాంశములతో నిండియున్నది. గ్రంథవిస్తరభీతిచేత వానినిందు వివరింపఁజాలమైతిమి.

శైలియు నాతికఠినమయి, మొత్తముమీఁద లక్షణవిధేయమయి, మధురమయి యున్నది. గ్రంథమును జక్కని కాగితములపైని మంచి పెద్దయక్షరములతో నచ్చు వేయఁబడియున్నది.

ఆంగ్లేయభాషా పరిజ్ఞానముగలిగి తెలుఁగును మృదుమధురశైలితో వ్రాయఁదగిన యీ గ్రంథకర్తవంటివారే యింకను మనభాషకుఁ గ్రొత్తలుగానున్న ప్రకృతిశాస్త్రముల నీభాషకుఁ దెచ్చుటకర్హులు. వీరికీకార్యమునందుఁ బ్రోత్సాహముగలుగుట కట్టిగ్రంథములపట్ల రాజకీయాధికారుల యాదరము నావశ్యకమే. కావున నుభయపక్షములవారికిని, నట్టిపూనిక కలుగవలయునని కోరుచున్నాము.

పయిగ్రంథము వెల యొకరూపాయి.

శ్రీమదాంధ్రకుమారసంభవము — వెంకటగిరియందలి రాజా వెలుగోటి ముద్దుకృష్ణయాచేంద్రాంకితముగాఁ, దదాస్థాన కవీంద్రుఁడగు బిరుదరాజ శేషాద్రి రాజకవిచే రచింపఁబడిన యీగ్రంథము (పద్యకావ్యము) మాకార్యస్థానముఁజేరినది. కాళిదాస త్రయములోని రెండవ సంస్కృతకావ్యమైన కుమారసంభవమునకిది తెలుఁగు. గ్రంథశైలి లక్షణవంతమయి నాతి కఠినమయి కానిపించుచున్నది.

ఈగ్రంథమందలి— "కుమారసంభవము విజ్ఞులు మేలు భళీయనంగఁ దెన్గింపుము గోస్తనీరసముఁ గేరు మృదూక్తి మదంకితంబుగన్" అను పంద్రెండవ పద్యమందలి "దెన్గింపుము" అను పదము శ్రోతలకు విలక్షణముగా వినఁబడునని మేమెంచుచున్నాము. 'గ' కారమే యత్యక్షరముగానున్న యిచ్చోట భళీయనం 'దెనింగింపుము' 'భళీయనంగఁ దెల్గింపుము' అని దిద్దిన నేహానియు రాదనియు మాయాశయము. "ప్రమాదో ధీమతామపి" యను న్యాయ్యమున నీకవీశ్వరుఁ డొకవేళ స్థూలదృష్టిచేత మొదటనట్లు ప్రయోగించినను, దిద్దుబాటున కంగీకరింపక మొదటఁ బ్రయోగించిన పదమే యుండవలెనని పట్టుపట్టునేని "ఇది కుమారసంభవముగనుక నమ్మాట యావశ్యకమే" యని మాస్నేహితులొకరు చేసిన పచ్చి పరిహాసమున కాపద్యము పాత్రమగుచున్నదని తలఁచుచున్నాము.

కూచిమంచి తిమ్మకవి సార్వభౌమునకు సకాలీనుఁడయిన వక్కలంక వీరభద్ర మంత్రి యను పేరుగల కవీశ్వరు లొకరీకుమారసంభవముఁ జిరకాలముక్రిందటనే గౌరీకల్యాణమను పేరఁ దెలిఁగించిరి.

ఈకవి కవితాధోరణి తెలియుటకయి యీగ్రంథమునందలి పద్యములును, పైనిఁ జెప్పిన వీరభద్రకవికృతమయిన గ్రంథమందలి పద్యములును, ఈక్రిందఁ బొందుపఱుచుచున్నాము.

శేషాద్రిరాజు— క. పరగు నుదగ్దిశ హిమవ ద్గిరినాథుఁడు దేవతాత్మఁ గెరలుచుఁ బూర్వా
పరవార్ధులఁ బొందివసుం । ధరకున్మానార్థమయిన దండమనంగన్.

వీరభద్రకవి— చ. అలరుచుఁ బూర్వపశ్చిమ దిగంబుధులం దగనంటి భూమికిం
గొలయగుయష్టినా నయన గోచరమైదివిషత్స్వరూపమై
చెలఁగిధరాధరేంద్రము విశేషతరోత్తరదిక్తటంబునన్
వెలయు హిమాలయంబనఁగ విశ్రుతనామమునుచే జగంబులన్.

శే— ఉ. ఇంతు తోడఁగూడి చరియించు కిరాతులకింపుగాఁగ న
త్యంతముఁ గుంజగేహములయందు వెలుంగుచునుండు నోషధుల్